క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను కలిసిన ఎంపీడీవో లవరాజు తదితరులు

అరకులోయ రూరల్: మండలంలోని శరభగుడ హౌసింగ్ కాలనీలో ఉంటున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగను బుధవారం ఎంపీడీవో లవరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిధిలో ఉన్న పలు సమస్యలపై చర్చించారు. అందరి సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఈవో రాజ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తదితరులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి: ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం చేపట్టిన స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి స్కిల్ సెన్సస్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో నిరుద్యోగ యువతకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీవోగా రాజు నియామకం



చింతపల్లి: చింతపల్లి మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా పి.రాజును అధికారులు నియమించారు. ఇక్కడ ఇప్పటి వరకూ ఏపీవోగా లక్ష్మీనారాయణ పనిచేశారు. ఆయన స్థానంలో కొయ్యూరు ఏపీవోగా పనిచేస్తున్న రాజును నియమించారు. వంద రోజుల పనిదినాల కల్పనతో పాటు జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు.

అందుబాటులో ఫిజియోథెరపీ సేవలు


భవిత కేంద్రంలో దివ్యాంగులతో ఫిజియోథెరపిస్టు రిషేంద్రవర్మ

చింతపల్లి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల నియామకాల్లో భాగంగా చింతపల్లి భవిత కేంద్రానికి ఫిజియో థెరపిస్టును నియమించారు. దేశగిరి రిషేంద్రవర్మను ఇక్కడ కేంద్రంలో నియమించడంతో ఆయన బుధవారం నుంచి దివ్యాంగులకు సేవలందించే కార్యక్రమాన్ని చేపట్టారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లోని భవిత కేంద్రాల్లోనూ తాను సేవలందించనున్నట్టు ఆయన తెలిపారు.

మెనూ అమలుచేయాలి


పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

చింతపల్లి: ఆశ్రమ పాఠశాలల్లో పక్కాగా మెనూ అమలుచేయాలని ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. బాలికలకు ఇస్తున్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. హెచ్‌ఎం కొండలరావు, వార్డెన్ నూకరత్నం పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099


పాడేరులో మట్టిదీపాల అమ్మకాలు


అరకులోయలో బాణసంచా కొనుగోలు చేస్తున్న గిరిజనులు


అరకు సంతబయలులోని సామగ్రి కొనుగోలు చేస్తున్న గిరిజనులు

దివ్య వెలుగుల దీపావళి

- గ్రామాల్లో వెలుగుల పండగ సందడి
- మార్కెట్లు కిటకిట
- పెరిగిన బాణసంచా ధరలు
- సిండికేట్ వ్యాపారులదే హవా


చింతపల్లిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

సాక్షి, పాడేరు: వెలుగుల పండగ దీపావళి జరుపుకునేందుకు ప్రజలు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పాడేరుతో పాటు అన్ని మండలాల్లోను బాణసంచా దుకాణాలకు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖల అనుమతులు ఇవ్వడంతో బుధవారం మధ్యాహ్నం నుంచే వ్యాపారాలు ప్రారంభించారు. బాణసంచా దుకాణాలను సురక్షిత ప్రాంతాలల్లోనే ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం పాడేరులో 17 బాణసంచా దుకాణాలకు అనుమతులు పొందిన వ్యాపారులంతా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసి విక్రయాలను ప్రారంభించారు.గత ఏడాది కన్నా ప్రస్తుతం షాపులు అధికంగా ఉన్నట్టు ప్రజలు చెబుతున్నారు. పాడేరుతో పాటు మండల కేంద్రంలోని మార్కెట్‌లలో మట్టిదీపాలు, పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి.

అరకులోయటౌన్: అరకులోయలో దీపావళి సందడి మొదలైంది. దీపావళి పూజ సామగ్రి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఈ ఏడాది మందుగుండు సామగ్రి ధరలు అమాంతంగా పెంచేశారు. అరకులోయ మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామ గిరిజనులతో పాటు ఒడిశా ప్రాంత ప్రజలు సైతం అరకలోయకు వచ్చి దీపావళికి సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకొని పలువురు వ్యాపారులు కుమ్మక్కై సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది రూ.80కు విక్రయించిన చిచ్చుబుడ్లు ఈ ఏడాది రూ. 140కి , లక్ష్మీ బాంబ్ స్పెషల్ రూ.100, 100వాలా బాంబ్ రూ.80, 200 వాలా బాంబ్‌లు రూ.100 విక్రయిస్తున్నారు.

డుంబ్రిగుడ: దీపావళి పండగకు మండలవాసులు సన్నద్ధమయ్యారు. మండలంలోని అరకు సంతబయలులో బుధవారం బాణసంచా దుకాణాన్ని ఏర్పాటుచేశారు. ధరలు గతంలో కంటే ఎక్కువగా ఉన్నాయి. అయినా వెలుగుల పండగ జరుపుకునేందుకు బాణసంచా సామగ్రి కొనుగోలు చేశారు. ఈ ఏడాది డుంబ్రిగుడ, కించుమండ గ్రామాల్లో దీపావళి మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేయలేదు. అరకు సంతయిలులో దుకాణానికి కలెక్టర్ దినేష్‌కుమార్ నుంచి అనుమతులు పొంది ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో దీపావళి పండుగ సందడి నెలకొంది.బాణసంచాతో పాటు పూజ సామగ్రి కొనుగోలులో ప్రజలు నిమగ్నమయ్యారు.గత ఏడాది కంటే బాణసంచా ధరలు పెరిగాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. ముంచంగిపుట్టుతో పాటు జోలాపుట్టులో బుధవారం బాణసంచా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. ఆశాజనకంగా వ్యాపారం సాగిందని దుకాణదారులు చెబుతున్నారు.

చింతపల్లి: చింతపల్లిలో దీపావళి సందడి నెలకొంది. చింతపల్లి వారపు సంతకు పండుగ శోభ సంతరించుకుంది. చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాలకు చింతపల్లి ప్రధాన పట్టణం కావడంతో ఆయా మండలాలు నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు బుధవారం చింతపల్లి వారపు సంతకు తరలివచ్చారు. దీంతో సంత కిటకిటలాడింది. అధికారుల అనుమతులతో కొందరు వ్యాపారులు చింతపల్లిలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో దుకాణాలన్నీ వినియోగదారులతో కిటకిటలాడాయి. చింతపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది.

రంపచోడవరం: ఏజెన్సీ ప్రధాన కేంద్రం రంపచోడవరంలో దీపావళి సందడి నెలకొంది. మారేడుమిల్లి రోడ్డులోని ఏపీ ఆర్ గురుకుల కళాశాల మైదానంలో బాణసంచా షాపులు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు దీపావళి సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. వాతావరణం మబ్బులతో ఉండడంతో వ్యాపారుల్లో గుబులు నెలకొంది. వర్షం వస్తే తమ సరుకుల పరిస్థితి ఏమిటి అని అయోమయంలో ఉన్నారు. వాతావరణం అనుకూలిస్తే బాగుంటుందని వ్యాపారులు భావిస్తున్నారు.


రంపచోడవరం ఏపీ ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలు


ముంచంగిపుట్టులో బాణసంచా విక్రయాలు

రోడ్డు పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నోయిన, ఎంపీటీసీ కమల

ముంచంగిపుట్టు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ జనం నొయిన అన్నారు. మండలంలోని పనసపుట్టు పంచాయతీ సంగంవలస గ్రామంలో రూ.2లక్షలతో చేపడుతున్న రోడ్డు పనులకు బుధవారం సర్పంచ్ నొయిన, ఎంపీటీసీ సభ్యురాలు కమల శంకుస్థాపన చేశారు. సర్పంచ్ నొయిన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరావు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కలిస్తున్న సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: మండలంలోని కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని అరకులోయ సీఐ హిమగిరి బుధవారం సందర్శించారు. కేరీర్ గైడెన్స్‌తో పాటు గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి తదితర డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి అనర్థాలను గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్ఐ గోపాల్‌రావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


విద్యార్థులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన జరగాలని, రోజూ హోమ్ వర్క్ ఇచ్చి ఉపాధ్యాయులు పరిశీలించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని కంఠబౌంసుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. అనంతరం వసతి గృహం, వంటశాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని రుచి చూసి, వంటకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ వేల్ఫేర్ అధికారి మాధవిని అభినందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అరకులోయ పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్ తదితరులున్నారు.

చిట్టిపడాల్‌కు ఘన నివాళి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ముంచంగిపుట్టు సమితి అధ్యక్షుడు, దివంగత నేత చిట్టిపడాల్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పడాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మండల కేంద్రం ఏర్పాటుకు చిట్టిపడాల్ ఎనలేని కృషి చేశారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు స్టేషన్, వారపు సంత ఏర్పాటుకు ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎం.దుర్గాప్రసాద్‌పడాల్, వివిధ సంఘాల, నేతలు గాసిరావు, ప్రసాద్‌రావుపడాల్, శ్రీను, మాధవరావు, నర్సింగ్‌రావుపడాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కొయ్యూరు: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ నుంచి గుడ్లపల్లి జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హింసకు దూరంగా ఉండాలన్నారు. శాంతి మార్గం ద్వారానే సమస్యలు పరిష్కరమవుతాయన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో భాగంగా విధుల నిర్వహణలో ప్రాణత్యాగాలర్పించిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మంప ఎస్ఐ శంకర్‌రావు, పోలీసులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి సంబంధించిన స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, స్థానికులు బుధవారం తహసీల్దార్ ఎం.వి.వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలదేవ్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాన్ని ఐటీడీఏ స్వాధీనం చేసుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. బినామీ పేర్లతో గిరిజనేతరులు మండల కేంద్రంలోని పలుచోట్ల అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, అడ్డుకోవాలని వినతిలో పేర్కొన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో తాంగులగుడ, శరభగుడ, కంఠభంసుగుడ, గ్రామస్తులు మగ్గన్న, జగన్నాథం, మంగునాయుడు, సహదేవ్ తదితరులున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి ఆస్పత్రిలోని సమస్యలపై వచ్చిన పలు ఫిర్యాదులపై చర్చించారు. సదరం క్యాంపుల్లో సర్టిఫికెట్ల మంజూరు కోసం అక్రమంగా సొమ్ము వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందాయని, ఇది తగదని, నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదన్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంవోతో పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలలని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ల్యాబ్ టెక్నిషియన్లు తమ జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌లు, వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి



ముంచంగిపుట్టు, అడ్డతీగలలో మాట్లాడుతున్న ఎంఈవోలు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు

ముంచంగిపుట్టు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగునుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో ఉపాధ్యాయులకు ఇస్తున్న బేస్‌లైన్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని, అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. బేస్‌లైన్ శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న ప్రతి అంశాలను పాఠశాలలో అమలు చేయాలని ఆయన కోరారు. మండల లెవెల్ రిసోర్స్ పర్సన్లు కామేశ్వరరావు, సూర్యనారాయణ, దాసయ్య, భాస్కరరావు, శిక్షణ పరిశీలకుడు ఏఎంవో భాస్కరరావు, సీఎంవో జ్ఞానప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపును కృషి చేసేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎంఈవో పి.శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయులకు మూడు రోజుల బేస్‌లైన్ శిక్షణ ఇచ్చామన్నారు. ఈ మేరకు బుధవారం ముగింపు రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో 3 నుంచి పదో తరగతి వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో రాణించేందుకు అవసరమైన అంశాలను ఈ శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు సూచనలిచ్చామన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను ఉపాధ్యాయులు పాఠశాలల్లో అమలుచేయాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో లవరాజు

అరకులోయ రూరల్: మండలంలోని చినలబుడు పంచాయతీ మాలివలస, చినలబుడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో లవరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా విస్తృతంగా ఉపాధి పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఫారంపాండ్, రాతికట్లు, కందకాల తవ్వకాలు తదితర పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కాఫీ సాగు, కాఫీ గింజల సేకరణ, గ్రేడింగ్ , కాఫీ పౌడర్ విక్రయాలు, ఎగుమతి తదితర విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం డుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్మయా మహిళ కాఫీ రైతు సంఘం నిర్వహించింది. కాఫీ గింజల గ్రేడింగ్, పౌడర్ తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కాఫీ సాగు విధానాన్ని తెలిపారు. కాఫీ పౌడర్ మార్కెటింగ్ అంశాలను విద్యార్థులకు తెలియజేశారు.

కాఫీ మార్కెటింగ్‌పై అవగాహన

కాఫీ పంటల అభివృద్ధి సంస్థ (అరకులోయ) సౌజన్యంతో కొమ్మన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.బి.వి.ఎస్ చంద్రశేఖర్, జె.అప్పలనాయుడు, అధ్యాపకులు పొన్నాడ, సౌజన్య, సరోజని, పార్వతమ్మ, కమల్, రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.


కాఫీ సాగు, మార్కెటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సేంద్రియ సాగుపై అవగాహన అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ గంగరాజు, ఏవో ఉమా మహేశ్వరి, రైతులు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండల కేంద్రంలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయాధికారులు, సిబ్బంది ఇస్తున్న సూచనలు, సలహాలను రైతులు పాటించాలన్నారు. సేంద్రియ సాగుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు


ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ సర్పంచ్ బొరగం భాగ్యవతి తీరు హాస్యాస్పదంగా ఉందని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. ప్రోటోకాల్ పాటించలేదని ఆమె చేస్తున్న రాద్ధాంతాన్ని ఖండిస్తూ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఎంపీపీ సీతమ్మ మాట్లాడారు. మండలంలోని జర్రెల పంచాయతీ చిడిపుట్టులో రోడ్డు పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రతో తాను శంకుస్థాపన చేశామని, ఈ సమాచారాన్ని సర్పంచ్ భాగ్యవతికి ఫోన్‌లో తెలియజేసినా ఆమె రాలేదన్నారు. అయితే దీనిపై ప్రోటోకాల్ పాటించలేదని ఆమె తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీలను విమర్శించడం తగదని, ఆమె స్థాయి తగ్గట్టు ఉండాలని ఎంపీపీ సీతమ్మ హెచ్చరించారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు


వ్యాసరచన పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు కృషి చేసిన గొప్ప వ్యక్తి పటేల్ అని అభివర్ణించారు. విద్యార్థుల చేత సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, విజేతలుగా నిలిచిన విద్యార్థులు జోసెఫ్, ఇంద్ర, జయంతి, మమతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, అధ్యాపకులు నాగబాబు, గణేష్, కొండబాబు, సుందరిరాణి, రాజు, లచ్చన్న, అప్పారావు, సోంబాబు, భవాని, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు

- క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు


రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబూరావు

కొయ్యూరు: మండలంలోని చింతలపూడిలో బుధవారం రెండు ఆటోలు ఢీ కొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గూడెం కొత్తవీధికి చెందిన ఆటోడ్రైవర్ జి.బుజ్జిబాబు మరో ఆటో డ్రైవర్ బాబురావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొయ్యూరు నుంచి కృష్ణాదేవిపేట వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేంద్రపాలెంకు చెందిన ఆర్.లక్ష్మి, ఆటో డ్రైవర్ బాబూరావు, రత్న కుమారి, సుక్కులకు గాయాలయ్యాయి. వారికి రాజేంద్రపాలెం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొయ్యూరు ఇన్‌చార్జి ఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.